క్లుప్తంగా

నేడు కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

అలంపూర్: కంది కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు కలుగోట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటలకు నాఫెడ్ తరుపున మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కలుగోట్ల పీఏసీఎస్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు హాజరు కానున్నట్లు తెలిపారు. ధరల స్థిరీకరణ పథకం ద్వారా ఈ కొనుగోళ్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలి

గట్టు: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధించే దిశగా అడుగులు వేయాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం తప్పెట్ల మొర్సు, గొర్లఖాన్‌దొడ్డిలో పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులు కూడా పిల్లలను చదివించాలని కోరారు. విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్లను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీ బొజ్జయ్యనాయుడు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమాంసాబ్, ఐసీపీఎస్ అధికారిణి లక్ష్మి, ఎంవీఎఫ్ ప్రతినిధి సదానందచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల శుద్ధి



అయిజ: అయోధ్యలో ఈనెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని సంకాపురంలో భక్తులు ఆలయాలను శుద్ధి చేశారు. శుక్రవారం ఆంజనేయస్వామి, వీరభద్ర స్వామి, ఈదమ్మ, సవారమ్మ, విజయరాయ, శివాలయాలతోపాటు విష్ణుపాదం, లింగమయ్య విగ్రహాలను నీటితో శుభ్రం చేశారు. కార్యక్రమంలో వివిధ ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయండి

అయిజ: పట్టణంలో అనేక ప్రధాన రోడ్లకు ఇరువైపుల వీధిలైట్లు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని వివిధ కాలనీల ప్రజలు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నిత్యానంద్‌కు విన్నవించుకున్నారు. కర్నూలు వైపు వెళ్లే రహదారిలో చిన్న తాండ్రపాడు టీరోడ్డు, ఉప్పల టీ రోడ్డు, ఉప్పల క్యాంపు టీ రోడ్డు వద్ద ప్రయాణికులు బస్సులు దిగుతూ ఎక్కుతూ ఉంటారని రాత్రి వేళ చిమ్మచీకటి ఉంటుందని వాపోయారు. అదేవిధంగా అయిజ– గద్వాల రోడ్డుకు ఇరువైపుల కట్ట కింది తిమ్మప్పస్వామి ఆలయం వరకు, అయిజ– తూంకుంట రోడ్డుకు ఇరువైపుల బొక్కమ్మబాయి వరకు, అయిజ– ఉప్పల రోడ్డుకు ఇరువైపుల ఉప్పలదొడ్డి పేట వరకు ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శేఖర్, రాజు పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ అధ్యక్షుడి నియామకం

గట్టు: కాంగ్రెస్ పార్టీ మండల ఆదివాసి ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నల్లగట్టుతండాకు చెందిన గోవింద్‌నాయక్‌ను నియమించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలోనే మండల అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షుడిగా వెంకటేష్‌నాయక్‌లను నియమిస్తూ, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ నియామక పత్రాలను అందజేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతీ దేవికి అభిషేకం, కుంకుమార్చన చేశారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. మండలంలోని పెద్ద ధన్వాడ నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించగా.. ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఖాదర్ భాషా తెలిపారు.

ప్రమాదాలకు కేరాఫ్..

అంతర్రాష్ట్ర రహదారి

- గుంతలమయంగా అలంపూర్–రాయచూర్ మార్గం
- మద్దూరు స్టేజి–శాంతినగర్ మధ్య తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



పైపాడు స్టేజీ సమీపంలో గుంతలమయంగా అలంపూర్–రాయచూర్ రోడ్డు

శాంతినగర్: నిత్యం వందలాది వాహనాలు, వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణించే అంతర్రాష్ట్ర రహదారి అది. రెండు లైన్ల రహదారి ఏర్పాటు చేశారు కానీ వాహనాలు వెళ్లడానికి తగ్గట్టుగా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. 15 ఏళ్ల క్రితం వేసిన సింగిల్ రోడ్డుకు ఇరువైపుల ప్యాచ్‌వర్క్ వేసి వదిలేయడంతో పాత రోడ్డు ఎగుడు దిగుడుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అంతేగాక మద్దూరు స్టేజి నుంచి శాంతినగర్ వరకు ఉన్న 2కి.మీ. రహదారి ఎత్తుపల్లాలతోపాటు గుంతలమయమైంది. రోడ్డు బాగా లేకపోవడంతో వాహనదారులు ఓవర్‌టేక్ చేసే సమయంలో, రాత్రివేళల్లో వాహనాలు అదుపుతప్పి ఢీకొనడం, గుంతల్లో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికాలంలో ఐదుగురు ప్రయాణికులు మృతి చెందారు. కొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని అటు కర్ణాటక, ఇటు తెలంగాణ ప్రయాణికులు కోరుతున్నారు.

ఎగుడుదిగుడు గుంతలు

మద్దూరు స్టేజి నుంచి శాంతినగర్ వరకు బీటీ రోడ్డు గుంతలమయమైంది. అంతేగాక ఎగుడుదిగుడుగా ఉండటంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. గుంతలు ఉండటంతో ఎవరు ఎటు వైపు వెళ్తారో తెలియని పరిస్థితుల్లో ఒకరినొకరు ఢీకొంటున్నారు. అంతేగాక అదుపుతప్పి వాహనాల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

మరమ్మతు చేపడతాం

మద్దూరు స్టేజి నుంచి శాంతినగర్ వరకు రెండు కిలోమీటర్ల మేర కొత్త రోడ్డు వేయడానికి టెండర్లు పిలిచాం. ఎవరూ టెండర్లు వేయడానికి ముందుకు రాలేదు. దీంతో రోడ్డు పనులు చేపట్టలేదు. త్వరలో ప్యాచ్‌వర్క్ చేయించి ప్రయాణికులకు సౌకర్యం కల్పిస్తాం.

– మహేష్, ఆర్‌అండ్‌బీ జేఈ, అలంపూర్

రాత్రి వేళల్లో భయం



కర్నూలు పట్టణానికి, అలంపూర్‌కు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటాం. ఆలస్యమై రాత్రి అయ్యిందంటే ప్రయాణం భయంకరంగా ఉంటుంది. కలుకుంట్ల నుంచి శాంతినగర్ వరకు తరచూ ప్రమాదాలు అవుతున్నాయి. చాలా మంది ప్రమాదాల బారిన పడి చనిపోయారు. రెండు కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాలంటే అందరూ భయపడతారు.

– భాస్కర్, పైపాడు, వడ్డేపల్లి మున్సిపాలిటీ

కొత్త రోడ్డు వేయాలి



మద్దూరు స్టేజి నుంచి శాంతినగర్ వరకు రోడ్డు దెబ్బతింది. డబుల్ రోడ్డు నిర్మించే సమయంలో పాత రోడ్డుకు ప్యాచ్ వేసి డబుల్ రోడ్డుగా మార్చారు. దీంతో రోడ్డు ఎగుడుదిగుడుగా తయారైంది. అంతేగాక మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. కొత్తవారు చాలా మంది గుంతలు ఎక్కడ ఉండేది తెలియక రాత్రి వేళల్లో ప్రమాదాలబారిన పడి కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. మరికొందరి ప్రాణాలు పోయాయి. పాత రోడ్డు పూర్తిగా తొలగించి కొత్త రోడ్డు వేయాలి.

– నాగులు, జూలెకల్ స్టేజి, వడ్డేపల్లి మండలం

అయోధ్య దర్శనానికి అవకాశం



మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

గద్వాల రూరల్: అయోధ్యలో రాముని దర్శనం నిమిత్తం జిల్లా నుంచి 400 మందికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తెలిపారు. ఆయన స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. అయోధ్యకు వెళ్లాలనుకునే భక్తులు వారి ఆధార్‌కార్డుతో పాటు రూ.1,900రుసుము చెల్లించాల్సి ఉంటుందని, వారికి అయోధ్య రాకపోక రవాణా ఖర్చులతో పాటు, భోజనం, విడిది వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న భక్తులు ఫిబ్రవరి 12వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచి అయోధ్యలోని రామమందిర దర్శనానికి బయలుదేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీకే స్నిగ్ధారెడ్డి, సంజీవ్‌భరద్వాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, బలిగెర శివారెడ్డి, బండల వెంకట్రాములు, రామాంజనేయులు, భీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూయించాలని ధర్నా



ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

చిన్నచింతకుంట: ఎదులాపురంలో గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటిపట్టాలకు స్థలాలను చూయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు శుక్రవారం గ్రామంలోని చిన్నచింతకుంట, దేవరకద్ర రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సునీత, నిర్మల, మణెమ్మ తదితరులు మాట్లాడారు. కొన్ని నెలల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామంలోని 38 మంది నిరుపేదలకు ఇళ్ల నిర్మాణానికి స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేసిందన్నారు. కానీ అట్టి స్థలాల పట్టాలకు సంబంధించి నేటివరకు స్థలాలను చూయించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్థలాలను చూయించాలని డిమాండ్ చేశారు. విషయంపై తహసీల్దార్ కృష్ణయ్య స్పందించారు. త్వరలోనే స్థలాలు చదును చేసి అందిస్తామని తెలిపారు. దీంతోవారు ధర్నా విరమించారు.

లెనిన్ శత వర్ధంతి విజయవంతం చేద్దాం

అలంపూర్: జిల్లాలో లెనిన్ శత వర్ధంతిని విజయవంతం చేద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రష్యా దేశంలో జార్ చక్రవర్తి పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాట విప్లవం విజయవంతం చేసిన మహా నాయకుడు లెనిన్ అన్నారు. దోపిడి దరిద్రం పోవాలని ప్రజలందరూ ఆత్మగౌరవంతో జీవించాలని పోరాటం చేశారన్నారు. 1924 జనవరి 21న లెనిన్ మృతి చెందినట్లు తెలిపారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా శత వర్ధంతి సభలు, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసింహ, నాగరాజు, పుల్లన్న తదితరులు ఉన్నారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న రేపల్లె దేవదాస్

గద్వాల అర్బన్: కార్మికులు, కర్షకులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లే దేవదాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటియూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు, కర్షకుల డిమాండ్లను నెరవేర్చాలని 1982లో జనవరి 19న సమ్మె చేసిన క్రమంలో తమిళనాడు ప్రభుత్వం చేసిన కాల్పుల్లో నలుగురు మరణించారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఐక్యదినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో ఉపాధి లేకుండా నిరుద్యోగ సమస్య తారస్థాయికి చేర్చిందని, దేశ సంపదను పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని, వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. కూలీలకు భద్రత లేకుండా పోయిందని, రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యమైయ్యాయని మండిపడ్డారు. దీని నుంచి దేశాన్ని, రాజ్యాంగ లౌకిక వ్యవస్థలను కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకటస్వామి, నర్సింహ, సవారన్న, గజేంద్ర, భాస్కర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు నమోదుకు అవకాశం

మానవపాడు: స్పెషల్ క్యాంపెయిన్ డేలో భాగంగా బీఎల్‌ఓల ఆధ్వర్యంలో మండలంలో 18ఏళ్లు నిండిన వారు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని డీటీ ధరణిషా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయా గ్రామాలలో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తున్నామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయిజ: మండలంలో ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న స్పెషల్ క్యాంపెయిన్ డేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షహిదాబేగం శుక్రవారం ప్రకటనలో ప్రజలను కోరారు. మండలంలోని ప్రజలు 18 ఏళ్లు నిండినా సరే ఇప్పటి వరకు ఓటు హక్కు నమోదు చేయించుకోని వారు శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాలవద్ద అధికారులను కలిసి ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని కోరారు. బీఎల్‌ఓలు అందరూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలని తహసీల్దార్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టండి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్మన్ చిన్నదేవన్న, అధికారులు

అయిజ: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో అధికారులు, సిబ్బందితో కలిసి చైర్మన్ పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం లోపించిన పరిసర ప్రాంతాలను గమనించి వాటిని పరిశుభ్రంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో ఎప్పటికప్పుడు పనులు చేస్తూ ఉండాలనానరు. ముఖ్యంగా రోడ్లను శుభ్రంగా ఊడ్చాలని, డ్రెయినేజీల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలని తెలిపారు.

మూత్రశాలలు నిర్మించండి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలికలకు ఒక్కటే మూత్రశాల ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థుల తల్లితండ్రులు వాపోతున్నారు. 400 మంది పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలో 200 మందికి పైగా బాలికలు ఉండగా, పాఠశాలలో ఒక్కటే మూత్రశాల ఉందని తెలిపారు. మన ఊరు–మన బడి పనులు చేపడుతున్న సందర్భంలో ఉన్న మూత్రశాలను పడగొట్టేశారు. ఇప్పటికైన పాఠశాలలో వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లికి చెందిన బీచుపల్లి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ పోతురాజు సోమనాద్రి, శ్రీనివాసులు శుక్రవారం గ్రామానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. ఇరువురు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని అమరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావలిమన్యం అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని కూడలిలో కావలి సువర్ణ 14వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరులను స్మరించుకుంటూ ప్రజాస్వామిక తెలంగాణకై ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. ఎంతో కాలంగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేసి నియామకాలను చేపట్టాలన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలను అర్పించిన 1,200 మంది అమరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని అమరుల ఆకాంక్షకు అనుగుణంగా పాలనను కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భీమేశ్వర్‌రెడ్డి, రాగన్న, కృష్ణసాగర్, పరశురాం, వినోద్‌కుమార్, తిమ్మారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం



అలంపూర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అలంపూర్: జవహార్ నవోదయ విద్యాలయల పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మాంటిస్సోరి పాఠశాలలో నవోదయ పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ అశోక్ కుమార్, చీఫ్ సూపరింటెండెంట్ బాలాజీ కృష్ణ కుమార్, సెంట్రల్ లెవల్ అబ్జర్వర్ మధు, ఎస్‌ఐ రమేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన జవహార్ నవోదయ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6వ తరగతి ప్రవేశం కోసం పరీక్షలు జరగనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 373 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని, పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9.30 గంటల వరకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని, బ్లూ లేదా బ్లాక్ పెన్‌తో హాజరు కావాలన్నారు.

ఎడ్లబండ్ల గిరక పోటీలు ప్రారంభం



ఎడ్ల బండ్ల గిరక పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గట్టు: మండలంలోని రాయాపురంలో గోకరమయ్య ఉర్సు సందర్భంగా శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఎండ్ల బండ్ల గిరక పోటీలను ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రైతు సంతోషంగా ఉంటేనే ఊరితో పాటు దేశం బాగుంటుందని తెలిపారు. గ్రామాల్లో అన్ని వర్గాల వారు కలసిమెలసి పండుగలు, ఉర్సులను నిర్వహించుకుంటూ సఖ్యతతో మెలగాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బండారి భాస్కర్, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, అంబన్న, నల్లారెడ్డి, నర్సింహులు, పూజారి వెంకటేష్, కర్రెప్ప, నర్సప్ప, ఉసేనప్ప, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత సూచించారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జెడ్పీ చైర్ పర్సన్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. సరిపడా తరగతి గదులు లేక ఇబ్బంది పడుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మన ఊరు–మన బడి ద్వారా చేపట్టాల్సిన పనులను అధికారులను ప్రశ్నించారు. పనుల అలసత్వంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆమె వేమన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రామకృష్ణ, గోవిందు, మల్దకల్, రాజశేఖర్, తాన్యనాయక్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి రవి

మానవపాడు: బాలల హక్కులను విస్మరించకుండా పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రవి తెలిపారు. శుక్రవారం మండలంలోని జల్లాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. బాలలకు అందించే ఆహారం, బాలల ఆరోగ్యం, విద్య ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా లైంగిక దాడులకు పాల్పడితే వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించాలని సూచించారు. పిల్లలు వేధింపులకు గురైనప్పుడు తమనుతాము ఏ విధంగా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధన్, అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు

గట్టు: మండలంలోని బస్వాపురంలో శుక్రవారం కబడ్డీ పోటీలను సర్పంచ్ హనుమంతునాయుడు ప్రారంభించారు. గొకరమయ్య ఉర్సు సందర్భంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జములమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మార్లబీడులో..

ధరూరు: మండలంలోని మార్లబీడు గోకారమయ్య ఉర్సు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు నడిగడ్డ రైతు హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ హాజరయ్యారు.

సమస్యల నడుమ సంత

- వారాంతపు సంతకు స్థలం కరువు
- రోడ్లపైనే విక్రయాలు



ధరూరులో రోడ్డుపైనే కూరగాయలు కొంటున్న ప్రజలు

ధరూరు: కొన్ని దశాబ్దాలుగా మండల కేంద్రంలో మంగళవారం జరిగే వారాంతపు సంతకు ప్రత్యేక స్థలం కరువైంది. ప్రత్యేక స్థలం లేక కూరగాయలను, ఇతర సరుకులను రోడ్లపైనే వ్యాపారులు అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. పంచాయతీకి ఏటా ఆదాయం సమకూరుతున్నా ప్రత్యేక స్థలం కేటాయించడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

చుట్టు పక్కల గ్రామాలైన మన్నాపురం, బూరెడ్డిపల్లి, జాంపల్లి, సోంపురం, పారుచర్ల, దోర్నాల, ఓబులోనిపల్లి, గుర్రోనిపల్లి, కాపులకుంట నుంచి వందలాది మంది సంతకు వచ్చి వారానికి సరిపడ కూరగాయలు, ఇతర సరుకులు, పంటలకు అవసరమయ్యే ఎరువులు, మందులు తీసుకెళ్తారు.

ఆదరణ కరువు..

ఒకప్పుడు గద్వాల, మల్దకల్ మండలాల్లో జరిగే పెద్ద సంతల తరువాతి స్థానం ధరూరుదే ఉండేది. నాణ్యమైన, తాజా కూరగాయలు లభించే సంతగా పేరున్న ధరూరు సంతకు రానురాను ఆదరణ కరువవుతోంది.

సంతకు స్థలం ఉండాలి



ధరూరులో నిర్వహించే సంతకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలి. స్థలం లేక రోడ్లు, కందకాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో వాహన రాకపోకలతో దుమ్ము, ధూళి పెరిగి కూరగాయల పై పడి పాడవుతున్నాయి. అదే కూరగాయలు కొని తినాల్సి వస్తోంది. సంబంధిత శాఖ అధికారులు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, ధరూరు

పరిశీలిస్తున్నాం..

సంతకు ప్రత్యేక స్థలం కొరకు స్థల పరిశీలన చేస్తున్నాం. సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి స్థల పరిశీలన చేస్తున్నాం. ఇంకా ఎక్కడ అన్నది నిర్ణయించలేదు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ముందుకు వెళ్తాం.

– తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ధరూరు